ప్రజాశక్తి
బుధవారం 07 ఆగస్టు 2024
5
కర్నూలు

హంద్రీనీవా కాల్వకు పడిన గండిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు గౌస్ దేశాయ్, రామకృష్ణ, రాధాకృష్ణ

హంద్రీనీవా కాలువ గండితో నష్టం

- కోతకు గురైన భూమికి, పంటకు నష్ట పరిహారం ఇవ్వాలి
- రైతులను వెంటనే ఆదుకోవాలి : సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - వెల్దుర్తి

హంద్రీనీవా కాల్వకు ఆదివారం రాత్రి కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం మల్లెపల్లి దగ్గర గండి పడడంతో మూడు మండలాలకు సంబంధించిన దాదాపు 250 ఎకరాల భూమి కోతకు గురై భారీ నష్టం జరిగిందని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, జి.రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు గురుశేఖర్, నగేష్ డిమాండ్ చేశారు. సిపిఎం ప్రతినిధి బృందం గండి పడిన హంద్రీనీవా కాల్వను, కోతకు గురైన పంట పొలాలను పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గండి పడిన ప్రాంతంలో వెల్దుర్తి, కల్లూరు, కోడుమూరు మూడు మండలాలకు సంబంధించిన రైతులు ఉన్నారని తెలిపారు. ఆదివారం రాత్రి గండి పడితే మంగళవారం వరకు అధికారులు మేలుకోకపోవడం బాధ్యతారహితమని విమర్శించారు. హెచ్ఎన్ఎస్ఎస్ అధికారుల నిర్లక్ష్యం ఎంత ఉందంటే ఈ ప్రాంతంలో గతంలోనే రెండుసార్లు గండీ పడినప్పటికీ శాశ్వతమైన సిమెంట్ బండ్ వేయకుండా పైపైన మట్టి కట్ట వేయడంతో రైతులకు భారీ నష్టం జరిగిందని విమర్శించారు. మొక్కజొన్న, మినుములు, కందులు, పొద్దుతిరుగుడు సాగు చేసిన రైతులు భారీగా నష్టపోయారని తెలిపారు. పాటు భూమి కోతకు గురి కావడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. భూమి దాదాపు 3 నుంచి 4 అడుగుల లోతు కోతకు గురి కావడంతో రైతులు కోలుకోలేని పరిస్థితి ఉందన్నారు. అగ్రికల్చర్, రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు సమన్వయం చేసుకొని భారీగా నష్టపోయిన రైతులకు కోతకు గురైన భూమికి, నష్టపోయిన పంటకు నష్ట పరిహారం ఇచ్చేలా నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఈ పంట పొలాలను పరిశీలించాలని కోరారు. ప్రతిసారి కోతకు గురవుతున్నా హంద్రీనివా కాల్వకు ఆ ప్రాంతంలో సిసి బండ్ వేయాలని వారు డిమాండ్ చేశారు. సిపిఎం మండల నాయకులు రాజు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాల్వ గండిని పరిశీలించిన అధికారులు

హంద్రీనీవా కాల్వ గండిపడిన ప్రాంతాన్ని కర్నూలు ఆర్‌డిఒ శేషరెడ్డి మంగళవారం పరిశీలించారు. కోతకు గురైన పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. యుద్ధ ప్రాతిపదికన గండిని పూడ్చే పని పూర్తి చేస్తామని తెలిపారు. కోతకు గురైన పంటను, భూమిని అంచనా వేయడానికి వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులను ఆదేశించామన్నారు. గండి వల్ల నీట మునిగిన పంటను జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి కూడా పరిశీలించారు. రైతులతో కలిసి జిల్లా సిపిఎం నాయకులు ముంపుకు గురైన పంటను, కోతకు గురైన నేలను వ్యవసాయ శాఖ జెడికి చూపించారు. పంట నష్టం అంచనా వేసి కోతకు గురైన భూమి నష్టాన్ని కలెక్టర్ కు సమగ్ర నివేదిక ఇచ్చి రైతులను వెంటనే ఆదుకోవాలని కోరారు.

రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శేషరెడ్డి

బోధించే వారు లేరు..!

- చదువులు ముందుకు సాగడమెలా..? - నిరుపయోగంగా నూతన పాఠశాల భవనం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆ పాఠశాలలో విద్యార్థులకు సరిపడ ఉపాధ్యాయులు లేరు. బోధించేవారు లేక విద్యార్థుల చదువులు ముందుకు సాగడం లేదు. అన్ని తరగతులకూ సరిపడ గదులు కూడా లేవు. ఎక్కువ మంది విద్యార్థులు ఒకే తరగతి గదిలో ఉంటూ చదువుకుంటున్నారు.

ఆదోని మండలం పెసలబండ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులే మాత్రమే ఉన్నారు. 1 నుంచి 7వ తరగతి వరకు 143 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. నిత్యం 120 మందికి పైగా విద్యార్థులు హాజరవుతున్నారు. చదువులు బోధించే వారు లేక చదువులు సాగడం లేదు. విద్యాహక్కు చట్టం ప్రకారం 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. ఈ పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ కేవలం ముగ్గురు ఉపాధ్యాయులతో, మూడు గదుల్లోనే బోధన కొనసాగుతోంది. ఒక గదిలో 1, 2వ తరగతులు ఉండగా, మరో గదిలో 3, 4, 5వ తగరతులు, మరో గదిలో 6, 7వ తరగతి విద్యార్థులు కలిసి చదువుకుంటున్నారు. అన్ని సబ్జెక్టులనూ ముగ్గురు ఉపాధ్యాయులే బోధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కూడా లేదు. వాడుకోవడానికి నీరు లేకపోవడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. గత వైసిపి హయాంలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఇలాంటి పరిస్థితి వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని, చదువుకునే సౌకర్యాన్ని పిల్లలకు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సర్దుబాటు ఉత్తమాటేనా..?

మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను సర్దుబాటు చేశామని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం కనిపించడం లేదు. ఇప్పటికీ చాలా పాఠశాలల్లో సర్దుబాటు చేయకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. కనీసం ఒకే ఒక ఉపాధ్యాయుడు ఉండే పాఠశాలలో సర్దుబాటు చర్యలు చేపట్టడం లేదనే వాదన వినిపిస్తోంది. ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు సైతం సక్రమంగా పాఠశాలకు వెళ్లడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతేడాది విద్యార్థుల సంఖ్య పడిపోతోంది. దీనికి కారణం ఆయా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయకపోవడం, మరోవైపు విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయకపోవడమేనని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. కొంతమంది ఉపాధ్యాయులను సర్దుబాటులో భాగంగా డిప్యూటేషన్ కింద ఆయా పాఠశాలలకు కేటాయించినా సదరు ఉపాధ్యాయులు వెళ్లడం లేదని తెలిసింది. ఆ ఉపాధ్యాయులు విద్యాశాఖాధికారులను మచ్చిక చేసుకుని డిప్యూటేషన్‌పై కేటాయించిన పాఠశాల ముఖం చూడడం లేదు. క్షేత్రస్థాయిలో విద్యాశాఖాధికారులు పర్యవేక్షించకపోవడంతోనే సమస్య ఎదురవుతున్నట్లు సమాచారం.

నిరుపయోగంగా నూతన పాఠశాల భవనం

గత వైసిపి ప్రభుత్వం నాడు-నేడు కింద కొన్ని వేల రూపాయలు ఖర్చు చేసి, నూతన పాఠశాల భవనాన్ని ఏర్పాటు చేశారు. నాడు-నేడు కింద కొత్త భవనంతో పాటు మౌలిక వసతులు, ప్రహరీ నిర్మించారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు కొరత ఉండడంతో నూతన పాఠశాల భవనం నిరుపయోగంగా ఉందని గ్రామస్తులు తెలుపుతున్నారు.

పాఠాలు బోధిస్తున్న ప్రధానోపాధ్యాయులు

వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేస్తున్నాం

- ఎంఇఒ రాజేంద్రప్రసాద్



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేస్తున్నాం. ఎక్కడెక్కడ ఉపాధ్యాయులు ఎక్కువగా, తక్కువగా ఉన్నారో నివేదికలను తయారు చేసి జిల్లా కార్యాలయానికి పంపిస్తాం. జిల్లా కార్యాలయం నుంచి ఉత్తర్వులు రాగానే ఈనెల 12న సర్దుబాటు కార్యక్రమం చేపడతాం.

ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ ముగ్గురు ఉపాధ్యాయులతో పాఠాలు బోధించడం తగదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపై సంతకం చేసింది. వెంటనే ఆ దిశగా అడుగులు వేయాలి. లేకపోతే కలిసి వచ్చే విద్యార్థి సంఘాల నాయకులతో ఉద్యమాలను ఉధృతం చేస్తాం.

మానసిక రుగ్మతలపై అవగాహన పెంచుకోవాలి

- డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మానసిక సమస్యలు, రుగ్మతలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్ కార్యాలయంలో జాతీయ మానసిక ఆరోగ్య అవగాహనహన దినాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డిపిఎంయు ఉమా, డిపిఒ విజయ రాజు, ఎస్ఒ హేమసుందరం, డెమో శ్రీనివాసులు శెట్టి ఆశా కార్యకర్తలు కార్యాలయ సిబ్బంది హాజరయ్యారు. అనంతరం గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆశాడే కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి శారీరకంగా ఎంత ఆరోగ్యంగా ఉన్నా మానసికంగా ప్రశాంతత లేకపోతే జీవన గమనం లయతప్పుతుందని అన్నారు. పొరపాట్లకు అవకాశం ఇస్తుందని దీర్ఘకాలిక రుగ్మతలకు దారితీస్తుందన్నారు. విపరీత ఆలోచనలతో ఆత్మహత్యకు ప్రేరేపిస్తుందని తెలిపారు. మానసిక జబ్బులపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో ఈ ప్రభావం సమాజంపై పడుతుందని తెలిపారు. నిద్రలేమి, అతినిద్ర, ఒంటరితనం, పరిస్థితులకు తగ్గట్టు సర్దుబాటు కాకపోవడం, అతి కోపం, అనుమానాలు, వ్యసనాలకు బానిస కావడం, మతిమరుపు రావడం, ఆందోళనకు గురి కావడం, వారిలో వారు నవ్వుకోవడం వంటి లక్షణాలు గల వారిని క్షేత్రస్థాయిలో గుర్తించి వైద్యాధికారుల దృష్టికి తీసుకుని రావాలన్నారు. అలాంటి వారిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం అధికారిని హేమలత మాట్లాడుతూ వివిధ రకాల మానసిక సమస్యలు పరిష్కారానికి టెలి మానస్‌ఎంతో ఉపయుక్తం అని తెలిపారు. ప్రజలు మానసిక ఒత్తిడి. భయాందోళనలు ఇతర సమస్యలు ఉన్నవారు టెలిమాన 14416కు ఫోన్ చేసి మీ సమస్యలు తెలపాలని సూచించారు. ఇక్కడ సుశిక్షితులైన కౌన్సిలర్లు అందుబాటులో ఉంటారని, తగిన సలహాలు సూచనలు ఉచితంగా సేవలు పొందవచ్చు అని తెలిపారు. కర్నూలు సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపి 30 నెంబర్ కూడా ఉచితంగా సేవలు పొందవచ్చునని తెలిపారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలని వీటిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నియంత్రించవచ్చునని అన్నారు. చాలామంది మానసిక సమస్య ఉందని తెలిసినా చికిత్సకు రావడం లేదని ఇలాంటి వారిని గుర్తించి వైద్యాధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. ఎప్పుడూ ఒంటరిగా ఉండడం, తీవ్రమైన చికాకు, నిరాశ, నిస్పృహ వంటి లక్షణాలు మానసిక సమస్యల బాధితుల్లో ఉంటాయని తెలిపారు. కుటుంబ సభ్యులు స్నేహితుల్లో ఈ తరహా లక్షణాలతో బాధపడుతుంటే వెంటనే వారిని వైద్యుల దగ్గరికి తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జయలక్ష్మి, వేణుగోపాల్ యాదవ్, ఎంపిహెచ్ఒ వెంకటరమణ, సామాజిక ఆరోగ్య అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు ఆశాకార్యకర్తలు ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

ర్యాలిని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర్

ఎన్‌క్యాప్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- కమిషనర్ పివి రామలింగేశ్వర్ ఆదేశం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌క్యాప్) పథకానికి సంబంధించిన ప్రతిపాదనలను త్వరగా సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు నగరపాలక కమిషనర్ పివి.రామలింగేశ్వర్ ఆదేశించారు. మంగళవారం నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ఆరోగ్య, హార్టికల్చర్ విభాగాల అధికారులతో ఎన్‌క్యాప్ కార్యక్రమంపై సమీక్షించారు. నగరానికి ఎన్‌క్యాప్ ప్రోగ్రాం కింద రూ.7.50 కోట్లు మంజూరు అయ్యాయని, వాటికి సంబంధించి ప్రధాన రహదారులకు, మురుగు కాలువలకు మధ్యన మట్టి లేకుండా రహదారులు, డివైడర్ల మధ్యన పచ్చదనం, పార్కుల నిర్మాణం, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు, జంక్షన్‌లలో వాటర్ ఫౌంటెన్లు, డస్ట్ అదుపు చేయు వ్యవస్థ నిర్వహణకు సంబంధించిన ప్రతిపాదనలన సిద్ధం చేయాలని కమిషనర్ అధికారులకు ఆదేశించారు. ఆరోగ్యధికారి కె.విశ్వేశ్వర రెడ్డి, ఎంఇషాకీర్, డిసిపి సంధ్య, హార్టికల్చర్ ఎడి విజయలక్ష్మి, శానిటేషన్ సూపర్వైజర్, సెక్రటరీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ రామలింగేశ్వర్

సిఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్‌పి బిందుమాధవ్

సిఎంతో జిల్లా కలెక్టర్ ,ఎస్‌పి ముఖాముఖి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష , జిల్లా ఎస్‌పి బిందుమాధవ్ మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో ముఖాముఖి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్య క్రమాలపై సీఎం కలెక్టరుకు దిశా నిర్దేశం చేసినట్లు తెలిసింది. జిల్లాలో రానున్న ఐదేళ్ల కాలంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై సీఎం కలెక్టరుకు వివ రించి నట్లు తెలిసింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కూడా జిల్లాలో చేపడు తున్న అభివృద్ధి కార్యక్రమాలపై సీఎంకు పూర్తి స్థాయిలో నిర్వహించారు. అనం తరం రాష్ట్రఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా జిల్లా కలెక్టర్ ఎస్‌పితో భేటీ అయ్యారు.

ట్రిపుల్‌ఐటి డిఎం సమస్యలను పరిష్కరించండి

కేంద్ర విద్యాశాఖ మంత్రికి ఎంపి వినతి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు లోని ట్రిపుల్ ఐటి(డిఎం) కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు కోరారు. సోమవారం ఆయన ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్‌తో భేటి అయిన ఎంపి ట్రిపుల్ ఐటిడిఎం కళాశాలలో ఖాళీగా ఉన్న 36 బోధన, బోధనేతర పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, కళాశాలలో నీరు, రోడ్లు, కరెంట్ సమస్యను పరిష్కరించి కాంపౌండ్ వాల్ నిర్మించాలని కోరారు. కళాశాల సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎంపి నాగరాజు తెలిపారు.

ఓర్వకల్ పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఓర్వకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1992.93 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.20వేల విలువచేసే మైక్ సెట్‌ను పాఠశాలకు వితరణ చేశారు. మంగళవారం పాఠశాల ఆవరణంలో పూర్వ విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్రరెడ్డి పూర్వ విద్యార్థుల నుండి స్వీకరించారు. పాఠశాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని పూర్వ విద్యార్థులు గోపికృష్ణ రఫీక్ నాగభూషణం రాముడు సరోజమ్మలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

అవినీతికి అడ్డుకట్ట వేయండి: డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రెవెన్యూ శాఖలో అవినీతికి అడ్డుకట్ట వేసి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్‌బాష, జిల్లా నాయకులు ప్రకాష్, పి. గౌతమ్‌తో కలిసి మంగళవారం డిఆర్‌ఒకు వినతి పత్రం అందజేశారు. ఆ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర మాట్లాడుతూ కల్లూరు మండలం సల్కాపురం గ్రామ నివాసి కల్లూరు మండల పరిధిలో పనిచేస్తున్న విఆర్ఒ మద్దిలేటి సల్కాపురం గ్రామంలో సాధారణమైన కుటుంబంలో పుట్టారన్నారు. రెండు ఎకరాల భూమి ముగ్గురు అన్నదమ్ములు ఉన్న కుటుంబంలో పుట్టారని అన్నారు. ప్రారంభంలో బీడీ బంకు నిర్వహిస్తూ బతుకు సాగించే వారిని అన్నారు. తర్వాత క్రమంలో గ్రామ తలారిగా పనిచేశారన్నారు. ఆ సందర్భంగా గ్రామ రైతుల నుండి గ్రామ ప్రజల నుండి ప్రతి చిన్న పని కోసం వేల రూపాయలు లంచం తీసుకుని జీవితాన్ని ప్రారంభించిన మద్దిలేటి 2008లో విఆర్ఒగా ప్రమోషన్ పొంది కల్లూరు అర్బన్‌లో పనిచేస్తున్నారని అన్నారు. విఆర్ఒగా ప్రమోషన్ పొందిన తర్వాత డబ్బుకు కొదవ లేకుండా అవినీతికి అంతులేకుండా సంపాదన పోగు చేసుకున్నారన్నారు. ప్రారంభ జీవితంలో బీడీబంకు నిర్వహించిన మద్దిలేటి గ్రామంలో కోటి రూపాయల ఇల్లు కర్నూలు నగరంలో రూ.మూడుకోట్ల భవనంఎలా కట్టించగలిగారని ప్రశ్నించారు. ఆయన అవినీతిపై అనేక పత్రికలు మీడియా ఛానల్లు కథనాలు రాశాయన్నారు. . ఎప్పుడైతే పత్రికలలో అతని అవినీతి బండారం బయటపడిందో అప్పటినుండి రహస్యంగా ఉన్న మద్దిలేటి రెండు రోజుల కిందట నుండి విధులు లోకి వచ్చారని మా దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి అవినీతిపరులను ప్రజలను పీడించి బతికే అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతికి వ్యతిరేకంగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆచరణలో చూపించాలని వెంటనే అతనిని విధుల నుండి బహిష్కరించి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

కొండాపురంలో పొలంబడి

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని కొండా పురంలో ఎఒ మల్లేష్ కుమార్ తమ సిబ్బందితో వెళ్లి మంగళవారం పొలం బడి సందర్శన చేపట్టారు. ఇక్కడే బీజామృతం ద్రవం పై అవగాహన కల్పించి రైతు మధుసూదన్ రెడ్డి వరి పొలంలో రెండున్నర ఎకరాలు వరి సాగు చేయించారు. సేంద్రియ ఎరువులతో పంటల దిగుబడులనిస్తుందని, వరి సస్య రక్షణ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని ఈ సందర్భంగా అన్నారు.

సాయంకోరి ... సెల్‌ఫోన్ చోరీ....

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్ : కోడుమూరులో సోమవారం మిట్ట మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో సెల్‌ఫోన్ చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు... ఇద్దరు వ్యక్తులు ఎండిఒ ఆఫీస్ ముందు టీ తాగు తున్నారు. ఇంతలో ఒక అపరిచితుడు మామ అని పిలిచాడు. నీ దగ్గర ఉన్న ఇతను మీ మనిషా అని అడిగాడు. నేను బజాజ్ ఫైనాన్స్‌లో పనిచేస్తున్నాను ఇక్కడకు కొంతదూరంలో ఒకబైక్ ఆగిపోయింది దానిని తీసుకు రావాలని అడిగాడు. మానవతా దృక్పథంతో పక్కనే ఉన్న రామకృష్ణను ఆ దొంగ బైకుపై పంపించాడు. కొంత దూరం వెళ్లిన తర్వాత బండిని మరల వెనక్కి తిప్పి వెనక ఉన్న రామకృష్ణను కిందకి దింపి నీఫోన్ ఇవ్వమని అడిగితీసు కున్నాడు. మాట్లాడుతున్నట్లు నటిస్తూ బైక్‌పై ఎక్కువ వేగంతో పారి పో యాడు. బ్లాక్‌కలర్‌లో ఉన్న పల్సర్‌కు నంబర్ ప్లేట్ లేనట్లు బాధితులు గుర్తించారు.

విఆర్ఎ నాగఅంజనమ్మకు న్యాయం చేయాలి

హేళన చేసినవారినిసస్పెండ్ చేయాలి -బహుజన యువసేన, వాల్మీకి బోయ సేవాసంస్థ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

నంద్యాల జిల్లా గడివేముల మండల విఆర్ఎగా విధులు నిర్వహిస్తున్న గడివేముల వాసి గువ్వల నాగ అంజనమ్మ గత కొంతకాలం నుండి అంధురాలనే చులకన భావంతో గడివేముల ఎంఆర్ఒ కార్యాలయ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ ఎల్లాసుబ్బయ్య, అటెండర్ తిమ్మరాజు కలిసి కార్యాలయ సిబ్బంది తిన్న ప్లేట్లను క్యారియర్లను కనికరం లేకుండా కడిగించుకోవడం చాలా భాదాకరం అన్నారు. మంగళవారం కర్నూలులో వాల్మీకి నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షుడు చంద్రాచెర్ల హరి మాట్లాడుతూ గడివేముల విఆర్ఎ నాగ అంజనమ్మ అంధురాలనే నెపంతో వారి తల్లితో వంట చేయించుకొని , కార్యాలయంలోనే వంటగది ఏర్పాటు చేసుకున్న వైనం, వారు తిన్న ప్లేట్లు కడుగుతూ వెట్టి చాకిరి పైగా సూటి పోటి మాటలు నువ్ ఉద్యోగానికి పనికిరావంటూ చులకనభావంతో మాట్లాడుతూ హేళన చేయడం బాధాకరమైన విషయం అన్నారు. కాలం ఎటు పోతుందీ మనం ఆధునిక సమాజంలో ఉన్నామా.! లేదా అనాగరిక సమాజంలో ఉన్నామా అనేది ఓ సారి ఆలోచించుకోవాలని అన్నారు. అభం , శుభం తెలియని పుట్టుకతో అంధురాలికి ఇదేనా కార్యాలయ సిబ్బంది ఇచ్చే గౌరవం అని ప్రశ్నించారు. గడివేముల ఎంఆర్ఒ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఎల్లాసుబ్బయ్య , అటెండర్ తిమ్మరాజులను విధుల నుండి తొలగించి , క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఉన్నత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా చేస్తామన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి

దళితుల భూములకు రక్షణ కల్పిస్తాం

ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పేద దళితుల భూములకు ప్రభుత్వం తరపున రక్షణ కల్పిస్తామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. మంగళవారం కర్నూలు మండలం మునగాలపాడు గ్రామంలో గత ప్రభుత్వంలో ఆక్రమణకు గురైన దళితుల భూములను టిడిపి సీనియర్ నాయకుడు డి.విష్ణువర్ధన్ రెడ్డి, బాధితులతో కలిసి ఆక్రమణకు గురైన భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా దస్తగిరి, విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... కర్నూలు మండలం, మునగాలపాడు గ్రామం పుంపుహౌజ్ వద్ద ఉన్న, దళితులకు చెందిన పట్టా భూములని, గత ప్రభుత్వ రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు కుమ్మక్కై రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పగించారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాంపౌండ్ వాల్ నిర్మించడం వల్ల కెసికెనాల్ ద్వారా ప్రవహించే నీరు, లీకై పంట భూములలోకి చేరి, పంటలు దెబ్బ తింటున్నాయని, గ్రామ రైతులు, ప్రజలు, తమని ఆశ్రయించారన్నారు. అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గిప్సన్, సుంకన్న, అయ్యన్న, రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ముమ్మాటికి హత్యే

బిపార్వతి హత్యపై జిల్లా కురువ సంఘం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

మంత్రాలయం మండలం రచ్చుమర్రి మోడల్ స్కూలులో 10వ తరగతి చదువుతున్న పార్వతిది ముమ్మాటికీ హత్యే అని కురువ సంఘం జిల్లా అసోషియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న ప్రదానకార్యదర్శి ఎంకె. రంగస్వామి, మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీలీలమ్మ మంగళవారం పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ బాలిక ఒంటిపై గాయాలున్నా అధికారులు అవేవి పట్టించుకోకపోవడం దారుణమని, నిర్లక్ష్యంగా వ్యవహరించడం అధికారులకు తగదని అన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించక పోతే తీవ్ర పరిణా మాలు ఎదుర్కో వాల్సి వస్తుందని హెచ్చరించారు. ఫ్యాన్ బాలికకు అందే పరిస్థితి లేక పోయినా ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యాజమాన్యం, పోలీసులు ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు బూదూరు లక్ష్మన్న, కొత్తపల్లి దేవేంద్ర, మంత్రాలయం మండల అధ్యక్షులు మల్లికార్జున, వీరనాగప్ప పాల్గొన్నారు.

అధికారులతో రైతుల వాగ్వాదం

ఎల్‌ఎల్‌సికి తగ్గిన నీరు...
- ఆందోళనకు దిగిన రైతులు..!

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర జలాశయం నిండుకుండలా ఉంది. తుంగభద్ర దిగువ కాలువలో మాత్రం నీటి ప్రవాహం పూర్తిగా తగ్గింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎల్‌ఎల్‌సి 250 కెఎం హనువాల్ వద్ద 750 క్యూసెక్కులు ఆంధ్ర వాటా కింద రావాల్సి ఉంది. మంగళవారం ఉదయం 268 క్యూసెక్కులు, సాయంత్రం 256 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. నీటిమట్టం పూర్తిగా పడిపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. వరి నాట్లు వేస్తున్న సమయంలో రైతులకు సాగునీరు అందకపోవడంతో అధికారులతో వాగ్వాదానికి దిగారు. కౌతాళం మేజర్ డిస్ట్రిబ్యూటర్ కింద మిరప, పత్తి పంటలు సాగు చేశారు. వరి నాట్లు వేయడానికి రైతులు సిద్ధమయ్యారు. ఈ సమయంలో అధికారులు నీటిని విడుదల చేయడంలో రైతులను ఇబ్బందులకు గురి చేయడంతో పట్ల రైతులు ఆగ్రహంతో కాలువపై ఆందోళనకు దిగారు. ఎల్‌ఎల్‌సి వర్క్ ఇన్‌స్పెక్టర్ పీరాతో వాగ్వాదానికి దిగారు. ఈ డిస్ట్రిబ్యూటర్ కింద 1,150 ఎకరాల ఆయకట్టుకు 16 క్యూసెక్కుల నీరు ప్రవహించాల్సి ఉంది. కేవలం కాల్వకు 4 క్యూసెక్కుల నీరు విడుదల చేయడంతో రైతులు అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా ఎల్‌ఎల్‌సి వర్క్ ఇన్‌స్పెక్టర్ పీరా మాట్లాడుతూ... పై భాగంలో నీరు తగ్గిపోవడంతో ఈ సమస్య ఏర్పడిందని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు. రైతులు కూడా అధికారులకు సహకరించాలని కోరారు.

పనులు కల్పిస్తాం.. వలసలు వెళ్లొద్దు..
- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మాట్లాడుతున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

పెద్దకడబూరు మండలంలోని గ్రామాల్లో ఎవరూ వలసలు వెళ్లొద్దని, అందరికీ పనులు కల్పిస్తామని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పెద్దకడబూరు సచివాలయంలో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలు ఎవరూ వలస వెళ్లకుండా గ్రామంలో పనులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కొలతల ప్రకారం పని చేస్తే రోజుకు రూ. 300 ప్రకారం వేతనం వస్తుందన్నారు. అందరూ ఉపాధి పనులకు వెళ్లాలని సూచించారు. 5 ఎకరాల్లోపు ఉన్న రైతులు పండ్ల తోటలు పెంచుకోవాలని, తద్వారా అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. చదువుకున్న యువతకు స్కిల్ డోవలప్‌మెంట్‌పై శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. ఎంపిడిఒ జనార్ధన్, జెఇ ఖాదర్, సిటిఎ గిడ్డయ్య, టిఎ రామ్మోహన్ రెడ్డి, మేటీలు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలి
- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దగ్గర స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు రవి కోరారు. మంగళవారం ఆదోని, పత్తికొండ రోడ్డుపై ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిత్యం రద్దీగా ఉండే రాయచూర్, బెంగళూరు, చెన్నైకి అధిక లోడుతో వాహనాలు తిరుగుతున్నాయని తెలిపారు. పాఠశాల ముందే రోడ్డు ఉండడంతో విద్యార్థులు రోడ్డు దాటేందుకు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. స్పీడ్ బ్రేకర్‌లు వేయాలని ఆర్‌అండ్‌బి అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండి పడ్డారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఆర్‌అండ్‌బి అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి పాఠశాలల ముందున్న రోడ్లపై స్పీడ్ బ్రేకర్‌లు వేసి విద్యార్థుల ప్రాణాలు కాపాడాలని కోరారు. లేకపోతే విద్యార్థులను సమీకరించి ఆర్‌అండ్‌బి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు మహేంద్ర, తరుణ్ తేజ్, యువరాజ్, అంజి, సంతోష్, మహేష్ పాల్గొన్నారు.

రోడ్డుపై ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు

ఎన్నాళ్లీ కష్టాలు..!

- ఉపయోగంలో లేని అండర్ గ్రౌండ్ బ్రిడ్జి
- ఇబ్బందులు పడుతున్న పాదచారులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని పై ఓవర్ బ్రిడ్జి సమీపంలో రేణుకాంబ హోటల్ వద్ద నిర్మించిన అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిరుపయోగంగా మారింది. రైల్వే లైన్ మీదుగా రాకపోకలు సాగించడం ప్రాణాంతకమని రైల్వే అధికారులు చెబుతున్నారు. రైల్వే లైన్ దాటే సమయంలో ఆదమర్చి కొందరు రైలు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం రైల్వే రాకపోకలు కూడా పెరిగాయి. అటువైపు వచ్చేందుకు ఎలాంటి అవకాశం లేకున్నా కొందరు గోడ దూకి రైల్వే లైన్ మీదుగా వచ్చే సాహసం చేస్తున్నారు. ఇబ్బందులు ఉండకూడదని టూరిస్ట్ లాడ్జి నుంచి శ్రీనివాస్ భవన్ వైపు వచ్చే, పోయే వారి సౌకర్యార్థం రైల్వే లైన్ లోపల భాగంలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. బ్రిడ్జి ఉపయోగంలో ఉన్న కాలంలో వృద్ధులు, మహిళలు, చిన్నారులు రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉండేది.

నిరుపయోగంగా ఉన్న అండర్ గ్రౌండ్ బ్రిడ్జి

నిరుపయోగంగా అండర్ గ్రౌండ్ బ్రిడ్జి

అండర్ గ్రౌండ్ బ్రిడ్జి అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారింది. దానికి అడ్డంగా కొందరు చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకొని ద్వారం మూసివేశారు. రైతు బజార్ నుంచి అండర్ గ్రౌండ్ బ్రిడ్జికి వెళ్లే దారి అంతా అపరిశుభ్రంగా మారింది. అక్కడ ఎవరూ రాకపోకలు సాగించకపోవడంతో బ్రిడ్జి నిరుపయోగంగా మారింది. కోసిగి, కౌతాళం, మంత్రాలయం, మాధవరం, రాయచూరు, సిరుగుప్ప, ఉరుకుంద, పెద్దతుంబలం, పెద్దహరివాణం ప్రాంతాలకు వెళ్లే వారు అటు వైపే వెళ్లాల్సి ఉంది. అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి నిరుపయోగంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల అటువైపు వెళ్లే వారే లేక పై ఓవర్ బ్రిడ్జికి ఏర్పాటు చేసిన మెట్లు ఎక్కి దిగలేక వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కి, దిగే సమయంలో అదుపుతప్పి కొందరు కింద పడిన సందర్భాలు ఉన్నాయి.

విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలి

అండర్ గ్రౌండ్ చుట్టూ పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి రాకపోకలకు అనుకూలంగా అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని మార్చాలని ప్రజలు కోరుతున్నారు. వర్షపు నీరు అందులోకి వెళ్లకుండా మరమ్మతులు చేయించాలని పేర్కొంటున్నారు. రంగులు వేయించి, విద్యుత్ సౌకర్యం కల్పించి నిరంతరం లైట్లు వెలిగేలా ఏర్పాటు చేస్తే ఆ దారి అనుకూలంగా ఉంటుందని పలువురు చెబుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

అండర్‌గ్రౌండ్ బ్రిడ్జిని ఉపయోగంలోకి తీసుకురావాలి
- పట్టణ పౌర సంఘం అధ్యక్షులు ఈరన్న

అండర్ గ్రౌండ్ బ్రిడ్జి లోపల సౌకర్యాలు లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. బ్రిడ్జి లోపల విద్యుత్ సౌకర్యం, మెట్లు ఏర్పాటు చేసి, వర్షపు నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకుంటే రాకపోకలకు అనుకూలంగా ఉంటుంది. గతంలో రాకపోకలకు ఎంతో అనుకూలంగా ఉండేది. కొందరు ఆకతాయిలు చేసిన అఘాయిత్యాల వల్ల అటువైపు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా అధికారులు చర్యలు తీసుకుంటే అందరికీ సౌకర్యంగా ఉంటుంది. త్వరలో అధికారులను సంప్రదించి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తాం.

భవనంలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

అడిగే వారు లేక..!

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రభుత్వ కార్యాలయ భవనం ద్విచక్ర వాహనాల పార్కింగ్‌గా మారింది. పంచాయతీ రాజ్ (పిఐయు) సబ్ డివిజన్ కార్యాలయంలో విధులకు హాజరైన అధికారులు తమ వాహనాలు సురక్షితంగా ఉండాలని ఏకంగా ప్రభుత్వ కార్యాలయ భవనంలోనే పార్కింగ్ చేస్తున్నారు. కార్యాలయానికి వచ్చిన ప్రజాప్రతినిధులకు, గ్రామీణ ప్రజలకు ఇబ్బందికరంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని ప్రజాప్రతినిధులు మండిపడుతున్నారు. బయట పార్కింగ్ స్థలం ఉన్నప్పటికీ కార్యాలయంలోనే పార్కింగ్ చేస్తుండడంతో అడిగేవారు లేక అధికారులు ఇలా ఇష్టానుసారంగా వివరిస్తున్నారని మండిపడ్డారు. కార్యాలయంలో ఒక డిఇ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు ఎప్పుడొస్తారో ఎప్పుడు పోతున్నారోనన్న సందేహం ఉందని, సరైన సమయానికి అధికారులు హాజరు కాకపోవడంతో కార్యాలయంలో పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు, ప్రజాప్రతినిధులు విమర్శిస్తున్నారు. ఈ కార్యాలయంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

పొలంలోనే రైతు మృతి
- వ్యక్తమవుతున్న అనుమానాలు

ప్రజాశక్తి - ఆస్పరి

కావలి చిన్న నరసన్న (ఫైల్)

తన సొంత పొలంలోనే రైతు విగతి జీవిగా పడి ఉన్న సంఘటన ఆస్పరిలో చోటు చేసుకుంది. ఆస్పరి గ్రామానికి చెందిన కొత్తగేరి కావలి చిన్న నరసన్న (52) శనివారం కాటమయ్య ప్రాంతంలో ఉన్న తన పొలానికి వెళ్లారు. రాత్రయినా ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో ఏ ఊరికైనా వెళ్లి ఉంటారని కుటుంబ సభ్యులు భావించారు. ఆదివారం కుటుంబ సభ్యులు శ్రావణమాసం కావడంతో ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నారు. నరసన్న కనపడలేదు. బంధువులకు ఫోన్ చేసి అడిగితే రాలేదని చెప్పారు. తన చిన్న కొడుకు మురళీ కాటమయ్య దగ్గర ఉన్న నల్లరేగడి పొలానికి వెళ్లి చూశారు. తండ్రి మృతి చెందిన విషయాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నరసన్న మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. సోమవారం రాత్రి మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మంగళవారం డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం పొలంలో వచ్చి రక్త నమూనాను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. పెద్ద కొడుకు రంగస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ హనుమంతప్ప తెలిపారు.

సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఎఫ్‌ఆర్ హైస్కూల్‌లో అష్టావధానం

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలోని ఎఫ్‌ఆర్ హైస్కూల్‌లో మంగళవారం అష్టావధానం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. అష్టావధానంలో పాల్గొన్న ఆముదాల మురళీ విద్యార్థులను రంజింప జేశారు. ఈ అష్టావధానంలో పృక్షకులుగా సవాప్పగారు ఈరన్న, దత్తపతిగా నల్లారెడ్డి, వర్ణనగా రమణమూర్తి, సమస్యగా వెంకటేశ్వర యాదవ్, వ్యక్తాక్షరిగా ఎస్‌వి.ప్రసాద్, ఆసుగా గోకినేని పరంధామయ్య, పురాణ పట్టణంగా సుధాకర్, అప్రస్తుత ప్రసంగంగా భాస్కర్ అవధానం నిర్వహించారు. ఈ అవధానంలో కంద పద్యాలు, చంపకమాల పదాలతో ఇచ్చిన సమస్యలను అవధాని పూరించారు. అప్రస్తుత ప్రసంగంలో చలోక్తులు వేసి అవధాని దృష్టి మళ్లించే ప్రయత్నం చేసినప్పటికీ అవధాని ఏకాగ్రతతో తన అష్టావధానాన్ని కొనసాగించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు భాషా వికాసానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని చెప్పారు. అష్టావధానంలో పాల్గొన్న ప్రిన్సిపల్ వేణుగోపాల్, అష్టావధాని ఆముదాల మురళీ, కవుల వర్గానికి పాఠశాల కరస్పాండెంట్ పి.రఘునాథ్, బి.ఉచ్చీరప్ప, ఉపాధ్యాయులు కవులకు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

ఈరన్న సన్నిధిలో బుట్టా రేణుక

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామిని మాజీ ఎంపీ, వైసిపి ఎమ్మిగనూరు ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక దర్శించుకున్నారు. శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఈమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శ్రీమఠంలో కర్ణాటక మాజీ మంత్రి పాటిల్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని కర్ణాటక మాజీ మంత్రి, మాజీ డిప్యూటీ స్పీకర్ ఎంఎస్.పాటిల్ దర్శించుకున్నారు. మంగళవారం దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీమఠం సహాయక పిఆర్‌ఓ హొన్నొళ్లి వ్యాసరాజాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. రాయచూరు నాయకులు గిరీష్ కనకవీడు ఉన్నారు.

గురు రాఘవేంద్ర ఎత్తిపోతల ద్వారా
ప్రతి ఎకరాకూ సాగునీరు
- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - నందవరం

గురు రాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం ద్వారా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నకొత్తిలి గ్రామ పరిధిలో ఉన్న సోగనూరు ఎత్తిపోతల పథకం స్టేజ్-1, కె.తిమ్మాపురం గ్రామంలోని సోగనూరు, కనకవీడు చెరువు స్టేజ్-2 దగ్గర పూజాలు చేసి, పంపులను స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తన తండ్రి మాజీ మంత్రి కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి కలలు గన్న గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల ద్వారా నేడు సాగునీరు అందించడం సంతోషంగా ఉందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఎత్తిపోతల పథకాలను సద్వినియోగం చేసుకోకపోవడంతో మోటార్లు పనిచేయడం లేదని తెలిపారు. ఐదేళ్ల పాలనలో మరమ్మతులకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం విడుదల చేయలేదని విమర్శించారు. నేడు దాదాపు రూ.2 కోట్లు మరమ్మతులకే ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఎత్తిపోతల పథకాల్లో ప్రతి వస్తువూ రైతుల సొమ్ము అని, అలాంటి దానిలో 600 కిలోలకు పైగా ఉండే కాపర్ మెటీరియల్‌ను దొంగలెత్తుకెళ్లడం సిగ్గుచేటని తెలిపారు. ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అనంతరం చిన్నకొత్తిలి గ్రామంలోని ఎంపియుపి స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థుల చదువు, మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ పాఠశాలలో డిజిటల్ బోర్డు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలుసుకొని, డిఇఒతో మాట్లాడతానని తెలిపారు. ఎత్తిపోతల డిఇ చిదంబరం రెడ్డి, ఎఇ శంకర్, టిడిపి సీనియర్ నాయకులు ఈరన్న గౌడ్, నాగరాజు గౌడ్, బండే గురు స్వామి, పుష్పావతి, నారాయణరెడ్డి, ధర్మపురం గోపాల్, ఖాసీం వలీ, చిన్నరాముడు, డబ్బా ఈరన్న, గజేంద్ర రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, సత్య రెడ్డి, పరశురాముడు, ఎంఎస్ వీరేష్ పాల్గొన్నారు.

ఎత్తి పోతల పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ

పార్వతి ఆత్మహత్యపై పూర్తి విచారణ జరిపి
నిందితులను కఠినంగా శిక్షించాలి
- మాజీ ఎంపిపి రఘురాముడు

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామ సమీపంలో ఉన్న మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో పార్వతి ఆత్మహత్యకు గల కారకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని పెద్దకడబూరు మాజీ ఎంపిపి రఘురాముడు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందా లేక ఎవరైనా హత్య చేశారా అన్న కోణంలో అధికారులు విచారణ చేపట్టాలని కోరారు. విచారణలో నిందితులుగా తేలిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. విద్యార్థి పార్వతి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

లక్ష్మమ్మవ్వ సన్నిధిలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు మంగళవారం స్థానిక మహాయోగి లక్ష్మమ్మ అవ్వ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు రాయచోటి సుబ్బయ్య సాదరంగా ఆహ్వానించారు. అనంతరం అవ్వకు ప్రత్యేక పూజలు చేయించి శాలువా, పూలమాలతో సన్మానించారు.


అవ్వ సన్నిధిలో ఎమ్మెల్యే రామాంజనేయులు

కరువు పరిహారంపై నీలి నీడలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

ప్రజాశక్తి - హోళగుంద

గతేడాది వర్షాలు కురువక పంటలన్నీ ఎండిపోయాయి. పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాలేదు. కరువు పరిహారం సంగతేంటి అని మండల రైతులు మండిపడుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

పొలాల్లో విత్తిన విత్తనాలు పత్తి, పొద్దుతిరుగుడు, వేరుశనగ, కొర్రలు, జొన్న పంటలు సరైన వర్షాలు లేక దెబ్బతిన్నాయి. ఎంత నష్టం వాటిల్లిందో వ్యవసాయ శాఖాధికారుల ద్వారా సర్వే చేయించి పూర్తి సమగ్ర నివేదిక ఆధారంగా కరువు పరిహారం అందించాలని నిర్ణయించారు. రైతు శ్రేయస్సు ప్రభుత్వ ధ్యేయమని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వాలు అన్నదాతలకు కొండంత నష్టం జరిగితే గోరంత పరిహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. కొంతమంది రైతులకు కరువు పరిహారం అందితే, మరి కొంతమంది రైతులకు కరువు పరిహారం అందక దిగులు చెందుతున్నారు.

హోళగుంద మండలంలో గొర్రెలకు వదిలేసిన పంట (ఫైల్)

కొండంత నష్టం.. గోరంత పరిహారం...

గతేడాది వర్షాలు కురవకపోవడంతో రైతులు కొండంత నష్టం వాటిల్లింది. వారికి గోరంత పరిహారం అందించి చేతులు దులుపుకున్నారు. అది కూడా కొందరికి అందితే.. మరికొందరికి అందలేదు. 50 ఎకరాలున్న రైతుకు సైతం ఐదెకరాల్లోపే పరిహారం అందిస్తామని గత ప్రభుత్వం నిబంధనలు పెట్టడం వల్ల పెద్ద రైతులకు రూ.34 వేలలోపు పరిహారం అందితే చిన్న, సన్న కారు రైతులకు రూ.10 వేల నుంచి రూ.20 వేలు వరకే పరిహారం అందింది. రూ.లక్షల్లో నష్టం వాటిల్లితే కంటి తుడుపు చర్యగా ఇంత తక్కువ ఇన్‌పుట్ సబ్సిడీ అందించడం ఎంతవరకు న్యాయమని రైతులు వాపోతున్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ ముంజూరు

మండలంలో 8,657.38 హెక్టార్లలో వివిధ పంటలకు నష్టం జరిగినట్లు గుర్తించారు. 8,819 మంది రైతులు ఉన్నట్లు, రూ.14,67,08,805 ఇన్‌పుట్ సబ్సిడీ ముంజూరైనట్లు రికార్డుల ఆధారంగా తెలుస్తోంది. కరువు కారణంగా నష్టపోయిన రైతులందరికీ కరువు పరిహారం అందలేదు. గత ఎన్నికల్లో వైసిపి ఓడిపోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇంకా మిగిలిన రైతులందరికీ అందాల్సిన కరువు పరిహారం అందుతుందా లేదా అని అన్నదాతల అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని తప్పుల వల్ల కొందరికి అందలేదు : ఎడిఎ సునీత

కొంతమంది రైతుల ఖాతా నెంబర్లు తప్పుగా నమోదు కావడం, ఆధార్ అనుసంధానం కాకపోవడం, బ్యాంకుల కోడ్‌లు ఇలా కొన్ని తప్పుల వల్ల చాలా మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదు. ఇన్‌పుట్ సబ్సిడీ అందని రైతుల నుంచి వివరాలు సేకరించి సరి చేసిన నివేదిక ఉన్నతాధికారులకు పంపాం. త్వరలో ఇన్‌పుట్ సబ్సిడీ వారి ఖాతాకు జమ అవుతుంది.

రెండు నెలలుగా వ్యవసాయ శాఖాధికారులు ప్రతిసారీ ఇదే సమాధానం చెబుతుండడంతో ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుందా లేదా అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం
- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, అబ్దుల్లా

ప్రజాశక్తి - ఆదోని

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, అబ్దుల్లా కోరారు. మంగళవారం ఆదోనిలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం 16 మంది సభ్యులతో పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సూరి, కార్యదర్శిగా గౌస్, ఉపాధ్యక్షులుగా శశిధర్, నాగరాజు, సహాయ కార్యదర్శులుగా భరత్ కుమార్, లోకేష్, వెంకట్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో డిగ్రీ కళాశాల భవన నిర్మాణంతోపాటు స్థానిక విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ నాయకులు శివ, నరసింహ, సంజయ్, కిరణ్ పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు
- వైద్యాధికారి విజయభాస్కర్

ప్రజాశక్తి- దేవనకొండ

ఆశావర్కర్లు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ప్రాథమిక వైద్యాధికారి విజయభాస్కర్ తెలిపారు. మంగళవారం దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆశాలుగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. సిహెచ్‌ఒ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యాధికారి విజయభాస్కర్

అక్రమ మద్యం పట్టివేత
- ఆరుగురిపై కేసు నమోదు
- ఐదుగురి అరెస్టు - మరొకరు పరారీ

ప్రజాశక్తి - చిప్పగిరి

అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్, ఆలూరు సెబ్ సిఐ మల్లిక, ఎస్ఐ వీరాస్వామి తెలిపారు. మంగళవారం ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్ పర్యవేక్షణలో ఆలూరు సెబ్ పోలీసులు దాడులు చేపట్టారు. ఆలూరు మండలం కురుకుంద, కమ్మరచేడు రస్తాలో కురుకుందకు అర కిలోమీటరు దూరంలో నాకాబందీ నిర్వహిస్తున్నారు. కర్ణాటక రాష్ట్ర రిజిస్ట్రేషన్ కలిగిన ఒక బొలెరో వాహనంలో కర్ణాటకకు చెందిన (52) మద్యం బాక్సులు రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. హోళగుంద గ్రామానికి చెందిన సలీం బాషా, హోళగుంద మండలం ముద్దటమాగి గ్రామానికి చెందిన కురుబ దుర్గన్న, ఆలూరు మండలం మూసానపల్లి గ్రామానికి చెందిన బోయ శేఖర్, బోయ హరిప్రసాద్, మనేకుర్తి గ్రామానికి చెందిన ఎర్రగుడి మురళీలు బొలెరో వాహనంలో మద్యం రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. అలాగే వాహన యజమాని బళ్లారి జిల్లా ఇబ్రహీంపురం గ్రామ నివాసి భీమప్పపై కూడా కేసు నమోదు చేశారు. మొత్తం ఐదుగురిని అరెస్టు చేసి, కేసులు నమోదు చేశారు. అనంతరం ఆలూరు మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు.

మద్యం బాక్సులను చూపుతున్న పోలీసు సిబ్బంది

మాట్లాడుతున్న రాఘవేంద్ర చౌదరి

కెవికెలో రైతులు, శాస్త్రవేత్తల ముఖాముఖి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం రైతులు, శాస్త్రవేత్తల ముఖాముఖి నిర్వహించారు. ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలత, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్.నరసింహులు (మిల్లెట్స్), డాక్టర్ కె.సతీష్ బాబు (సస్య ఉత్పత్తి) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, నంద్యాల, ఎడిఎ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కెవికె ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాఘవేంద్ర చౌదరి మాట్లాడారు. పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, రైతులకు కెవికె అందించే సేవలను వివరించారు. అధిక సాంద్రత పద్ధతిపై ప్రతి సాగులో మెళకువలు, దాని వల్ల కలిగే లాభాలు, పందిరి వివరణపై అవగాహన తెలిపారు. రైతులకు పత్తి, వరి, కంది, మిరప, ఉల్లి పంటలో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణపై వివరించారు. అనంతరం ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలత మాట్లాడారు. నూతన సాంకేతికత గురించి, కొత్త రకాల విత్తనాల గురించి వివరించారు. శాస్త్రవేత్త నరసింహులు మాట్లాడుతూ... చిరుధాన్యాల పంటలో కొర్రలు (సూర్యనంది, గరుడ రకాలు), సజ్జలు విస్తరణ ఎక్కువగా ఉందని తెలిపారు. కందిలో కొర్రలు అంతరపంటగా వేసుకుంటే రైతులు ఎక్కువ లాభం పొందవచ్చని తెలిపారు. డాక్టర్ కె.సతీష్ బాబు పొగాకు యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. డాక్టర్ మౌనిక మిరప పంటలో వడల తెగులు నివారణ గురించి వివరించారు. పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ నిరంజన్ మాట్లాడుతూ... సమీకృత వ్యవసాయ పద్ధతులను పాటించాలని, ఆవులు, గేదెలలో ఆహార యాజమాన్యం గురించి తెలిపారు.

పంట నమోదు తప్పనిసరి
- ఎఒ అశోక్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మంత్రాలయంలో పంటలను పరిశీలిస్తున్న ఎఒ

మండలంలోని వివిధ గ్రామాల్లో సాగు చేసిన పంటలను తప్పనిసరిగా నమోదు చేయించు కోవాలని ఎఒ సి.అశోక్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలం లోని నారాయణపురం, చాగి, బసాపురం గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమాన్ని రైతుల సమక్షంలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంట నమోదుతో అన్ని రకాల ప్రభుత్వ రాయితీలకు, ఇన్స్యూరెన్స్, మద్దతు ధరకు పంట ఉత్పత్తి అమ్మకం కోసం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి రైతూ తప్పనిసరిగా పంటలను నమోదు చేసుకోవాలని చెప్పారు. వారి వారి గ్రామాల్లో ఉండే రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్ ఇవ్వాలని తెలిపారు. **మంత్రాలయం** మండలం అన్ని గ్రామాల్లోని రైతులు పంట నామోదు చేసుకోవాలని ఎఒ జీరా గణేష్ కోరారు. మండలంలోని సూగూరు, బూదూరు గ్రామాల్లో పంట నమోదును తనిఖీ చేశారు.